క్లుప్తంగా

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న పరమేష్

కొండమల్లేపల్లి: బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్లకు సంబంధించి నాచియప్పన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు లింగంపల్లి మధు, కృష్ణ, గిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రవినాయక్

పెద్దవూర : ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని నీమానాయక్‌తండా గ్రామ పంచాయతీలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తు మాయ మాటలతో పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్ను సుందర్‌రెడ్డి, మెండె సైదులు, పాదిల శ్రీనివాస్, శ్రీకర్‌నాయక్, శశిధర్‌రెడ్డి, శంకర్‌నాయక్, స్వామి, నిరంజన్, రవి, ముని తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

మాడుగులపల్లి : మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల నాయకులు ఆదివారం మండలంలోని మర్రిగూడెం, దాచారం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 11ఏళ్ల కాలంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాజవరపు గురుస్వామి, దారమళ్ల నాగరాజు, చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, నలబోతు సైదులు, ఆవుల చంటి, వెంకన్న, రాములుయాదవ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : ఆశా వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో సీఐటీయూ జిల్లా స్థాయి విస్తృత స్థాయి దొడ్డి కొమురయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశాలకు ఒకే జాబ్ చార్ట్ ఉండాలన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు డి మహేశ్వర, సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, తవిటి వెంకటమ్మ, కవిత,బి. అనూష, సుజాత, పార్వతమ్మ, సౌజన్య, సునీత, వసంత, స్వర్ణ, జ్యోతి పాల్గొన్నారు.

భగవంతుని అనుగ్రహం పొందాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ తమ బాధ్యతలు నిర్వర్తిస్తూనే భగవంతుని అనుగ్రహం పొందాలని ఇస్కాన్ మందిరం ప్రవచనకర్త, భగవద్గీత ప్రచారకులు ప్రభుజి హృషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత మూడవ అధ్యాయంపై ప్రసంగించారు. భగవద్గీత బోధనల ద్వారా కర్మ బంధాలకు అతీతంగా భగవంతుని అనుగ్రహం పొందవచ్చని వివరించారు. పట్టణంలో శ్రీ కృష్ణుడి దేవాలయం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సీవి చరమందరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

రైతులకు 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి

- సాగర్ నియోజకవర్గంలో మొత్తం 1,13,252 మంది రైతులు
- 38,660 మంది రైతుల దరఖాస్తుల నమోదు
- రైతులంతా నమోదు చేసుకోవాలంటున్న అధికారులు



శాఖాపురంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

హాలియా : రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. అందుకనుగుణంగా అన్నదాతలకు పారదర్శకంగా పథకాలను చేరవేసేందుకు భూమి కలిగి ఉన్న ప్రతి రైతన్నకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో 11అంకెల విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియకు వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోని రైతు వేదికల్లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వ్యవసాయాధికారులు చేపట్టారు. ఆధార్‌ను పోలిన గుర్తింపును రైతులకు అందించి అదే గుర్తింపు కార్డు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలను అందించేందుకు ఫార్మర్ ఐడీని తప్పనిసరి చేయనుంది. ప్రతి రైతు తమ ఆధార్‌తో పాటు పట్టదారు పాస్‌బుక్, ఆధార్ లింక్, ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీల ఆధారంగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. పీఎం కిసాన్ పథకం, సబ్సిడీపై ఫర్టిలైజర్, యంత్ర పరికరాల సరఫరా తదితర కేంద్రం అమలు చేయనున్న పథకాల ప్రయోజనాలు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న రైతులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ నమోదు ప్రక్రియ సాగర్ నియోజకవర్గంలో మూడు నెలలుగా కొనసాగుతోంది.

నియోజకవర్గంలో 38శాతం నమోదు

నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని గుర్రంపోడు, పెద్దవూర, తిరుమలగిరి (సాగర్), అనుముల, నిడమనూరు, త్రిపురారం మండలాల్లో మొత్తం 1,13,252 మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలను కలిగి ఉన్నారు. ఈ క్రమంలో ఇప్పటికి 38,660 మంది రైతుల దరఖాస్తులను అధికారులు నమోదు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 38శాతం మేర ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. మిగిలిన 74,592 మంది రైతులు ఇంకా నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో గుర్రంపోడు మండలం సాగర్ నియోజకవర్గంలో ముందు వరుసలో ఉంది. ఈ మండలంలో మొత్తం 26,711 మంది రైతులు ఉండగా 9,152 మంది రైతుల దరఖాస్తులను అధికారులు నమోదు చేశారు. రెండోస్థానంలో తిరుమలగిరి (సాగర్) మండలం నిలిచింది. ఈ మండలంలో మొత్తం 15,247 మంది రైతులకు గాను 6603 మంది రైతుల దరఖాస్తులను అధికారులు నమోదు చేశారు. అదే విధంగా పెద్దవూర మండలంలో మొత్తం 20,155 మంది రైతులకుగాను 6399 మంది రైతుల దరఖాస్తులను నమోదు చేశారు. నిడమనూరు మండలంలో మొత్తం రైతులు 18797 మంది రైతులకు గాను 6121 మంది రైతులు, అనుముల మండలంలో 15823 మంది రైతులకు గాను 5663 మంది రైతుల దరఖాస్తులను అధికారులు నమోదు చేశారు. ఇక త్రిపురారం మండలం రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియలో నియోజకవర్గంలోనే వెనుకబడిపోయింది. ఈ మండలంలో మొత్తం 16,516 మంది రైతులకుగాను 4722 మంది రైతు దరఖాస్తులు మాత్ర మే అధికారులు నమోదు చేశారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు గుర్తింపు నెంబర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని లేనిపక్షంలో రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి



కేంద్ర సంక్షేమ పథకాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలి. రైతులకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ అందించి తద్వారా కేంద్ర ప్రభుత్వం అందించేందుకు సంక్షేమ పథకాలను రైతులకు మరింత పారదర్శకంగా అందించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ఐడీని అందిస్తుంది. రైతులకు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

– సరిత, ఏడీఏ హాలియా డివిజన్

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వైద్యశిబిరంలో మందులను అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

మిర్యాలగూడ అర్బన్ : వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ భరత్‌కుమార్, సురేష్, నిఖిల్ దేశ్‌ముఖ్, కళ్యాణ్, అరుణ, ఇంద్రసేనారెడ్డి లు రోగులను పరిక్షించారు. అవసరమైన రోగులకు ఈసీజీ, టూడీ ఈకో, బీపీ, షుగర్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఎమ్మెల్యే ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరక్టర్ మదుసూధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని యాద్గార్‌పల్లిలో శ్రీ సత్తెమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బోనమెత్తుకొని శ్రీముత్యాలమ్మ తల్లికి సమర్పించేందుకు వచ్చిన మహిళలతో భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంటా శ్రవణ్‌రెడ్డి, గంటా ప్రకాశ్‌రెడ్డి, రవి, ఉపేందర్, నాగరాజు, నాగేష్, రవీందర్‌నాయక్, ఫయాజొద్దిన్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని దామరచర్ల సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో మహిళా రైతు కూలీలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనట్లయితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుజ్జి, లలిత, మంగ్లీ, రాణి, సుధా, సావిత్రి, నాగమ్మ, మమత పాల్గొన్నారు.



రైతు కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి



పెద్దవూర : సైకిల్ యాత్రలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు



తిరుమలగిరి(నాగార్జునసాగర్): కేజీబీవీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దవూర : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సంరక్షణ, ప్రభుత్వ విద్యా పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం పెద్దవూరకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల పట్ల సవతితల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. సైకిల్ యాత్రకు సీఐటీయూ నాయకులు దుబ్బ రామచంద్రం, ఎస్‌కే బషీర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు కుర్ర సైదానాయక్, కోరె రమేష్, బుడిగ వెంకటేష్, రవీందర్, కిరణ్, స్పందన, జగదీష్, సాయి, జగన్, వీరన్న, రాకేష్, భార్గవ్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఎస్ఓను సస్పెండ్ చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): విధుల్లో సమయపాలన పాటించని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ఎస్ఓ సస్పెండ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండల కమిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ పది రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ ఎస్ఓకి షోకాజ్ నోటీసులు ఇచ్చినా కలెక్టర్ నిర్ణయాన్ని లెక్కచేయకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వర్తించడం బాధాకరమన్నారు. వారానికి మూడు రోజులు మాత్రమే పాఠశాలకు వస్తూ మిగతా రోజుల్లో పాఠశాలకు వచ్చినట్లు రికార్డులో సంతకాలు పెడుతున్నట్లు వారు ఆరోపించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించకుండా, విద్యార్థులకు భయభ్రాంతులకు గురిచేస్తుందని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎస్ఓను వెంటనే విధుల నుంచి తొలగించాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైకిల్ యాత్ర బృందం కోరే రమేష్, బుడిగ వెంకటేశ్, స్పందన, కిరణ్, రవీందర్, జగదీశ్, జగన్, వీరన్న, సాయి, శివ, ప్రణీత్ పాల్గొన్నారు.

విద్యకు అధిక నిధులు కేటాయించాలి

కొండమల్లేపల్లి : ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర ఆదివారం కొండమల్లేపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి చర్యలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుర్ర సైదానాయక్, బుడిగ వెంకటేష్, స్పందన, కోరే రమేష్, ముక్కు రవీందర్, పొట్ల రాకేష్, గణేష్, జగన్, రాజేష్, రామలింగం, వీరన్న, శివ, గంగా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి అన్నారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 29న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విజయ్, సైదులు, గుండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడులో మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల కాంగ్రెస్ నాయకుడు గాలి కొండల్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పి. లలిత, డాక్టర్ జి. బ్రిహితలు సుమారు వంద మంది మహిళలను పరిక్షించారు. గర్భకోశ సంబంధిత వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు గ్రామీణ ప్రాంత మహిళల ఆరోగ్యంకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన కొండల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు షేక్ సయ్యద్ మియా, జాల యాదయ్య, సైదులు, సైదులు, రావుల కళ్యాణ్ గౌడ్, రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ మొయినొద్దిన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీలను చెల్లించడంతోపాటు అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగు చెల్లించడంతో పాటు అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే విధంగా చూస్తామన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం టీచర్లకు రూ. 18 వేలు గౌరవ వేతనాలను ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల వయస్సు 65 నుంచి 60 ఏళ్ల వరకు మార్చాలన్నారు. ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జూలకంటి మల్లేశ్వరీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పెరిక వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు చాంద్‌పాష్, యూనియన్ నాయకురాళ్లు ఎం. విజయ, నాగమణి, గౌసియా, సజ్యా, శేష్మా, రజియా, పద్మావతి, లక్ష్మిబాయి, మాధవి, సైదమ్మ, చంద్రకళ తదితరులున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశ సమధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

25 ఏళ్లకు ఒకే వేదికపైకి పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని విద్యోదయ పాఠశాలలో 1999–2000లో పదో తరగతికి చెందిన చెందిన పూర్వ విద్యార్థులు 25ఏళ్ల తరువాత ఒకే వేదికపై చేరుకున్నారు. ఆదివారం మండలంలోని వెంకటాద్రిపాలెం పంచాయతీ పరిధిలోని కేశవనగర్‌లోని రీయాన్ బీఈడీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరిని ఒకరు ముందుగా ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలియజేసుకొని ఆనాటి తరగతి గదిలో మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం ఎవరేవరు ఏఏ స్థాయిలో స్థిరపడినారో వివరించుకున్నారు. ఆనాటి గురువులు, విద్యోదయ పాఠశాల వ్యవస్థాపకులు పుప్పాల సత్యం, ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్ రావు, ఎం. లక్ష్మీనర్సింహ్మారెడ్డి, పుప్పాల యాదగిరి, రాపోలు శ్రీనివాస్, ఎస్‌కె ముస్తాఫా, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజేశ్వర్‌రావు, పున్నమ్మ, గీతాంజలి, అమృతమ్మ, నీరజ, ప్రమిల, కమలలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు టి. శోభారాణి, జి. అర్చన, డి. మంగ్తా నాయక్, ఎన్ శ్రీనివాస్, నర్సింహ్మా, ఎస్‌కె నాగూర్ తదితరులున్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషిచేయాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో అల్పాహార వితరణకు సిద్ధమవుతున్న గోపా సభ్యులు

నల్లగొండ టూటౌన్: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని గౌడ ఆఫీషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులుగౌడ్ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గోపా 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగుల సహాయకులకు అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐతగాని లాల్‌బహదూర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నేలపట్ల శ్రీధర్‌గౌడ్, కోశాధికారి పోలగాని వెంకటేశ్వర్లుగౌడ్, నర్సింగ్ వెంకటేశ్వర్లుగౌడ్, నకిరెకంటి శ్రీనయ్య గౌడ్, జెర్రిపోతుల శంకర్‌గౌడ్, కమ్మంపాటి వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

ప్రమాదకర మూలమలుపులు.. జరభద్రం!



పెద్ద దేవులపల్లి ఎడమ కాలువ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



త్రిపురారం గ్రామ పంచాయతీ వద్ద..

- కానరాని హెచ్చరిక బోర్డులు
- చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు

త్రిపురారం : మండల కేంద్రంలో ఎన్‌హెచ్–167 రహదారి నుంచి బాబుసాయిపేట, పెద్ద దేవుల పల్లి గ్రామాలను కలుపుతూ కుక్కడం వద్ద హైదరాబాద్‌కు వెళ్లే రహదారిపై 14 కిలో మీటర్ల రోడ్డుపై అతి ప్రమాదక మూలమలుపులు ఉన్నాయి. దీంతో ఆ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ రహదారి సింగిల్ రోడ్డుగా ఉండగా ప్రస్తుతం డబుల్ రోడ్డుగా నిర్మించారు. దీంతో వాహనాలు వేగంగా వెళ్తుండడంతో నిత్యం ఏదో ఒక్క మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమదాలు చోటుచేసుకుంటున్నారు. ఈ రహదారిలో భారీ పరిశ్రమలు డాక్టర్ రెడ్డీస్, విశాఖ పరిశ్రమ, కృషి విజ్ఞాన కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయం పాలిటెక్నిక్ కళాశాల, టీజీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పాటు హైదరాబాద్ వెళ్లడానికి ఈ రోడ్డు అనుకూలంగా ఉంటుంది. ఈ రహదారిపై భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే అడవి దేవులపల్లి రోడ్డులో బెజ్జికల్ గ్రామ క్రాస్ వద్ద, త్రిపురారం గ్రామ పంచాయతి, మసీదు వద్ద సైతం మూలమలుపులు అతి ప్రమాదకరంగా ఉన్నాయి. మూలమలుపులు ఉన్న చోట తగిన జాగ్రత్తలతో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే టీజీ మోడల్ స్కూల్ వద్ద ప్రతి రోజు విద్యార్థులు రోడ్డుపైకి రావాల్సి రావడంతో వేగంగా వచ్చే రహదారులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. టీజీ మోడల్ స్కూల్ వద్ద కూడా వాహనాలు వేగం తగ్గించుకునే విదంగా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సమీపంలో అడవిదేవుల పల్లికి వెళ్ల రహదారిలో నడి గ్రామంలో అతి ప్రమాదకర మూలమలుపు ఉంది. అలాగే మసీదు వద్ద ప్రమాదకర మూలమలుపు ఉంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్‌లు స్లిప్ అయ్యి కిందపడుతున్నారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

- నగిరి శ్రీనివాస్, త్రిపురారం

ఇబ్బందులు పడుతున్నారు



త్రిపురారం నుంచి హైదరాబాద్ రోడ్డు టీజీ మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు రోడ్డుకు సమీపంలో ఉండడంతో విద్యార్థులు ప్రతి రోజు తప్పనిసరిగా రోడ్డుపైకి రావాల్సి వస్తుంది. డబుల్ రోడ్డు కావడంతో వాహనాలు వేగంగా వస్తున్నాయి. దీంతో విద్యార్థులకు రోజు చాల ఇబ్బందికరంగా ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి ఈ ప్రాంతంలో రోడ్డుపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

- ఏళ్ల మహేందర్‌రెడ్డి, త్రిపురారం